సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం | 18 | జూలై | 2025



ఇచ్చోడలో దొంగల బీభత్సం

ఇచ్చోడ మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. బుధవారం రాత్రి తాళం వేసిన మూడిళ్లలో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచారు. 8లో▸



బైక్ దొంగల ముఠా అరెస్ట్

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వారి నుంచి 12 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

భువనేశ్వర్ వర్క్‌షాప్‌లో కలెక్టర్



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: దేశంలోని ఆస్ప్రేషనల్ బ్లాక్‌లో అమలు చేసిన కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒడిశాలోని భువనేశ్వర్‌లో గురువారం వర్క్‌షాప్ నిర్వహించింది. కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. నార్నూర్ బ్లాక్‌లో బాధ్యతాయుత పాలనకు సంపూర్ణ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఆరోగ్యం, విద్య, పోషణ, వ్యవసాయం, ఉపాధి, మౌలిక వసతులు తదితర రంగాల్లో ప్రగతి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకుముందు ఢిల్లీలో రాజ్యసభకు సంబంధించిన సన్‌సద్ టీవీలో ప్రసారమయ్యే ప్రతిష్టాత్మక అభినవ పహల్ 3.0 సిరీస్‌కు సంబంధించిన ఇంటర్వ్యూలో జిల్లా సంక్షేమాధికారి మిల్కాతో కలిసి పాల్గొన్నారు. నార్నూర్ బ్లాక్‌లో అమలు చేసిన కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు.

పరిహారం చెల్లించాకే భూసేకరణ



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

సాత్నాల: పరిహారం చెల్లించాకే భూసేకరణ చేపట్టాలని కామాయి, యాపల్‌గూడ రైతులు తహసీల్దార్ విశ్వనాథ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి తమ భూములివ్వాలంటే సర్వే నంబర్–82లో ఎకరానికి రూ.30 లక్షల చొప్పున ఇచ్చినా, లేదా.. ఎంత భూమి కోల్పోతున్నామో.. అంత వ్యవసాయ భూమి కొనిచ్చినా అంగీకరిస్తామన్నారు. లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. గంగన్న, గోల్కొండ రమేశ్, కస్తూరి రమేశ్, గంద్రత్ రాజేశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.నరేందర్ గ్రేడ్–1 శానిటరీ సూపర్‌వైజర్‌గా ప్రమోషన్‌పై నిజామాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అనిల్‌జాదవ్

బోథ్: నియోజకవర్గంలోని ప్రధాన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ గురువారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలన కోసం ఆర్అండ్‌బీ సీఈని ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉన్నారు.

నేడు రిమ్స్‌లో ఇంటర్వ్యూలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల కోసం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. సీఎంవో, ఆర్ఎంవో, ట్యూటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్, జాతర్లలోని గిరిజన బాలుర ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 22న ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ మైదానంలో, 23న జాతర్లలోని క్రీడా పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 56 ఖాళీలు, ఆరులో 1, ఏడులో 4, ఎనిమిదో తరగతిలో 3 ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 5, 6, 7 తరగతులు చదువుతున్న అన్ని యాజమాన్య పాఠశాలల గిరిజన విద్యార్థులు అర్హులని తెలిపారు. టెస్టులు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఆంగ్ల మాధ్యమంలో విద్యతో పాటు కోచ్‌ల ద్వారా హాకీ, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఏటీడీవోలు విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు.



కలెక్టర్ కార్యాలయం

చుట్టపుచూపు సార్లే!

- జిల్లాకు వచ్చేందుకు సుముఖత చూపని అధికారులు, ఉద్యోగులు
- వచ్చినోళ్లు డిప్యుటేషన్‌పై వెనక్కి..
- మెజార్టీ శాఖల్లోనూ ఇన్‌చార్జీలే..
- అంతా దిగువ శ్రేణి ఉద్యోగులే..
- జిల్లా అభివృద్ధిపై తీవ్ర ప్రభావం

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్రంలో బదిలీలపై నిషేధం ఉన్నా జిల్లాకు ప్రత్యేక మినహాయింపు ఉంది. ఇందుకు 1997 మార్చి 27న జారీ అయిన జీవో ఆర్‌టీ నంబర్ 455 నిదర్శనం. అలాగే ఇక్కడి నుంచి ప్రభుత్వ ఉద్యోగి బదిలీపై వెళ్లాలంటే తప్పనిసరి సమాంతర ప్రత్యామ్నాయం ఉండాలి. లేనిపక్షంలో అసలు ఆ ఉద్యోగిని ఇక్కడి నుంచి రిలీవ్ చేయరాదు. ఇందుకు సంబంధించి 1997 జూన్ 4న జారీ అయిన మెమో నంబర్ 44041/ఎస్‌ఈసీ.ఏ/97–1యే సాక్ష్యం. ఇలాంటి నిబంధనలుండగా పలువురు అధికారులు, ఉద్యోగులు ఇలా బదిలీ జిల్లాకు రావడం.. అలా డిప్యూటేషన్‌పై వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. జిల్లాలోని అనేక శాఖల్లో రెగ్యులర్ ఉన్నతాధికారులు లేకపోవడం, వచ్చినవారు ఇలాగే వెళ్లిపోతుండడంతో సమాంతర ప్రత్యామ్నాయం కాకపోయినా దిగువస్థాయి ఉద్యోగులు ఇన్‌చార్జి అధికారులుగా వ్యవహరిస్తుండడంతో జిల్లాలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. అయినా.. పాలకులు, అధికారులు రెగ్యులర్ అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవడం లేదనే అపవాదు ఉంది.

అన్ని శాఖల్లోనూ ఇన్‌చార్జీలే..

జిల్లాలో ప్రస్తుతం అన్ని శాఖలూ ఇన్‌చార్జి అధికారులతోనే కొనసాగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. తాజాగా జేడీఏ హోదా కలిగిన అధికారి మేకల గోవింద్ మంగళవారం జిల్లాకు బదిలీపై వచ్చారు. ఉదయం బాధ్యతలు తీసుకుని మధ్యాహ్నమే ఇక్కడి నుంచి రిలీవై నిజామాబాద్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జిల్లాకు వచ్చిన అతను కనీసం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగానైనా కలవలేదు. బాధ్యతలు తీసుకుంటున్నట్లు సమాచారమూ ఇవ్వలేదు. ఇక్కడి నుంచి డిప్యుటేషన్‌పై నిజామాబాద్‌కు వెళ్తున్నట్లు తెలుపలేదు. మరి ఈ అధికారికి రిలీవ్‌కు గ్రీన్ సిగ్నల్ లభించిందా..? ఇలాంటి అనేక అంశాలు ఉద్యోగుల్లో చర్చకు దారి తీశాయి. ప్రస్తుతం విద్య, మహిళా శిశు సంక్షేమశాఖ, వ్యవసాయ, వైద్యారోగ్యశాఖ, పశుసంవర్ధక శాఖ, ఉపాధికల్పన శాఖ, ఉద్యానవన శాఖ, డీఐఈవో, పౌర సరఫరాల శాఖ, డీవైఎస్వో, సెట్విన్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్.. ఇలా చెప్పుకొంటూపోతే అన్ని శాఖల్లో ఉన్నతాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనేక శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించడం, వారు ఇక్కడికి వచ్చిన కొద్ది కాలంలోనే తిరిగి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. దీంతో దిగువశ్రేణి ఉద్యోగులు ఇన్‌చార్జి అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించే పరిస్థితి ఏర్పడగా, వారు పోస్టుపై చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపడంలేదని తెలుస్తోంది.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల అమలు పకడ్బందీగా జరగాలంటే అధికారులు, ఉద్యోగులు లక్ష్య సాధనతో పనిచేయాలి. అప్పట్లో మావోయిస్టుల ప్రభావం తీవ్రంగా ఉండటం, జిల్లాకు సరైన రవాణా వసతులు లేకపోవడం తదితర కారణాలతో ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన అధికారులు, ఉద్యోగులు నామమాత్రంగా బాధ్యతలు స్వీకరించి ఆ తర్వాత వెళ్లిపోయేవారు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో అత్యధికంగా గిరిజనులు నివాసముండే ఈ ప్రాంతంలో సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యం ఎదురవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కార్యసాధకులుగా వ్యవహరించాల్సిన అధికారులు ఈ జిల్లాలో పనిచేసేందుకు ఇప్పటికీ సుముఖంగా లేకపోవడం, వచ్చిన అధికారులు, ఉద్యోగులు ఇక్కడి నుంచి జంప్ అవుతుండడాన్ని పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలున్నాయి. అనేక రూల్స్ ఉన్నప్పటికీ ఇక్కడికి వచ్చే ఉద్యోగులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ తమ స్వార్థప్రయోజనాల కోసం వెళ్లిపోతున్నారనే అపవాదు ఉంది.

పోస్టు కాపాడుకునేందుకే ప్రాధాన్యత

దిగువశ్రేణి ఉద్యోగులు ఇన్‌చార్జి అధికారులుగా వ్యవహరిస్తున్న క్రమంలో వారు తమ పోస్టును కాపాడుకునేందుకే ప్రాధాన్యతిస్తారనే అపవాదు ఉంది. ఎందుకంటే.. వారి స్థాయి పోస్టుల్లో ఇతరులుండగా ఉన్నతాధికారులు ఎక్కడ తమ పోస్టు ఇతరులకిస్తారేమోననే భయం వారిని వెంటాడుతోంది. దీంతో వారు స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వర్తించలేని పరిస్థితి ఉంది. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల కేటాయింపుల్లో సరైన ప్రణాళిక లోపిస్తుందన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు జిల్లాకు ప్రత్యేకంగా ఉన్న నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సి ఉండగా, పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వారికి రూల్స్‌పై అవగాహన లేదా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

వడ్డీలేని రుణం.. అతివలకు వరం

- రూ.1.57 కోట్ల బకాయిల విడుదల
- 4,202 ఎస్‌హెచ్‌జీలకు ప్రయోజనం
- బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్న నగదు

మంజూరైన వడ్డీలేని రుణం, సంఘాలు

మండలం	మొత్తం గ్రూపులు	మంజూరైన రుణాలు (రూ.లక్షల్లో)
ఆదిలాబాద్‌రూరల్	261	10.32
బజార్‌హత్నూర్	271	10.35
బేల	189	6.84
భీంపూర్	155	05.35
బోథ్	541	23.72
గాదిగూడ	121	1.93
గుడిహత్నూర్	200	07.03
ఇచ్చోడ	265	10.42
ఇంద్రవెల్లి	277	7.65
జైనథ్	274	10.98
మావల	52	2.10
నార్నూర్	204	6.82
నేరడిగొండ	296	11.17
సిరికొండ	117	3.80
తలమడుగు	241	9,46
తాంసి	180	7.17
ఉట్నూర్	558	22.01

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులను చేయాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఇందుకోసం మహిళాశక్తి ద్వారా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రధానంగా బ్యాంక్‌ల ద్వారా రుణాలిస్తూ వారు ఆర్థికంగా ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తోంది. రుణాలను సకాలంలో చెల్లించిన సంఘాలకు వడ్డీ మాఫీ చేస్తున్న ప్రభుత్వం ఈ నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి దీన్ని పక్కాగా అమలు చేస్తూ అతివలకు అండగా నిలుస్తోంది. ఇప్పటికే పలుసార్లు రుణాల వడ్డీని విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చికి



సంబంధించిన వడ్డీ బకాయిలను విడుదల చేసింది. జిల్లాలోని 4,202 సంఘాలకు గాను రూ.1.57 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేస్తోంది.

ఆర్థిక చేయూతనిచ్చేందుకే..

జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో 7,532 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 1,16,492 మంది సభ్యులున్నారు. వీరు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద బ్యాంక్‌ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తోంది. మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు తోడ్పడుతోంది. ఈ రుణాలను సకాలంలో వడ్డీతో పాటు బ్యాంక్‌లకు తిరిగి చెల్లించిన మహిళా సంఘాలకు ప్రభుత్వం వారి వడ్డీని బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ సొమ్ముతో కలిపి బ్యాంకుల్లో ఉన్న రుణాన్ని తగ్గిస్తారు. తద్వారా మహిళా సంఘాలపై వడ్డీ భారం పడకుండా ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రుణాల వడ్డీని చెల్లించకపోవడంతో ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రెండు నెలల బకాయిలు విడుదల

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి వడ్డీలేని రుణాలను సక్రమంగా విడుదల చేస్తోంది. ఏడాదిన్నర పాలనలో ఇప్పటివరకు మూడుసార్లు వడ్డీ విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా మరోసారి రూ.1.57 కోట్లు విడుదల చేసింది. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను పక్కాగా అమలు చేస్తున్నారు. తాజాగా జిల్లాలోని 4,202 సంఘాలకు రూ.1.57 కోట్లు విడుదల చేస్తూ మహిళల ఖాతాల్లో జమ చేయనుంది. ప్రభుత్వ నిర్ణయంపై ఎస్‌హెచ్‌జీ సభ్యుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

ఆదిలాబాద్: జిల్లా స్విమ్మర్లు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని డీవైఎస్వో శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలకు గ్రూప్–1 విభాగంలో సీహెచ్ దీక్షిత్, పీ మణిక్రిష్, గాందేవార్ సాయి, బీ విశ్వజ్ఞ, గ్రూప్–2 విభాగంలో చరణ్‌తేజ్, ఎస్.రితేశ్, ఎం.శ్రవాన్ష్, మనీశ్ రాథోడ్, గ్రూప్–3 విభాగంలో సా



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్వో శ్రీనివాస్

యి శివాంక్, జే ఆమోఘ్ ఎంపికయ్యారు. జిల్లా స్విమ్మింగ్ ఆక్వాటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ జిత్ కుమార్, పూల్ నిర్వాహకుడు రాష్ట్రపాల్, శిక్షకులు కృష్ణ, చందు తదితరులున్నారు.

ఆపద్బాంధవులు పోలీసులు

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ఆపద సమయంలో పోలీసులు ఆపద్బాంధవులుగా వ్యవహరిస్తారని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 'డయల్ 100'లోని పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బందికి సీపీఆర్, అత్యవసర సమయంలో స్పందించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ షాక్, పాముకాటు, అగ్నిప్రమాదం, రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు చేయాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో వైద్యులను పిలిచి ప్రథమ చికిత్స అందేలా చూడాలని ఎస్పీ సూచించారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఏఆర్ డీఎస్పీ ఇంద్రవర్ధన్, ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ ర్యాంకర్లకు సన్మానం

ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన పోలీసుల పిల్లలు చౌహాన్ కార్తిక్ (787వ ర్యాంక్), రాథోడ్ లావణ్య (803), రాథోడ్ గోవర్ధన్ (1,506వ ర్యాంక్)ను ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ కార్యాలయంలో శాలువాలతో సత్కరించారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు బహుమతులు అందజేసి అభినందించారు. పోలీస్ కార్యాలయ సూపరింటెండెంట్ సులోచన, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, జైస్వాల్ కవిత, వామన్, కొండ రాజు తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్ శిక్షణ పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సఖీ కేంద్రం పరిశీలన

జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. కేంద్రం ద్వారా పోలీస్ సేవలు, న్యాయ, వైద్యసహాయం, తాత్కాలిక వసతి, కౌన్సెలింగ్ అందించనున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆపద సమయంలోనైనా మహిళలు 'డయల్ 100', సఖీ కేంద్రం హెల్ప్‌లైన్ 181ను సంప్రదించాలని సూచించారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్, సఖీ కేంద్రం సిబ్బంది నాగమణి, లావణ్య, సంఘమిత్ర, అక్షయ్ ఉన్నారు.

ఆలోచన అదిరింది.. ఆహ్లాదం దొరికింది

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గజిటెడ్ ఉన్నత పాఠశాల–1కు చెందిన గణిత ఉపాధ్యాయుడు బోయర్ ప్రశాంత్‌కుమార్ ఆలోచన ఔరా.. అనిపిస్తోంది. పాఠశాల ఆవరణలో పనికిరాని ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, పైపుల్లో పూలమొక్కలు పెట్టి నిత్యం నీటిని అందిస్తున్నారు. దీంతో మొక్కలు పెరిగి పూలు పూస్తున్నాయి. తరగతిగది ముందు ఇలా కనిపించే పచ్చదనం ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆహ్లాదం పంచుతోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఐటీడీఏ పీవోను తొలగించాలని ధర్నా



ఉట్నూర్ రూరల్: ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు



కైలాస్‌నగర్: కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

కైలాస్‌నగర్: గిరిజన నిరుద్యోగులు నష్టపోయేలా ఎలాంటి గైడ్‌లైన్స్ లేకుండా సీఆర్టీ నియామకాలు చేపడుతున్న ఐటీడీఏ పీవోను తక్షణమే విధుల నుంచి తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. పీవో తీరును వ్యతిరేకిస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఆర్టీల నియామకాలపై అనుమానాల నివృత్తి కోసం విద్యార్థి సంఘాలు, ఆదివాసీ నాయకులు బుధవారం పీవోను కలవగా దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. మెరిట్ ప్రకారం నియామకాలు చేపట్టకుండా గిరిజనేతరులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొత్తగా నోటిఫికేషన్ ప్రకటించి నియామకాలు చేపట్టాల్సి ఉండగా 2023 ప్రకారమే నియామకాలు చేపడతామనడం సరికాదని తెలిపారు. వెంటనే పీవోను బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో వినోద్‌కుమార్ వారి వద్దకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. వారి నుంచి వినతిపత్రం స్వీకరించారు. నాయకులు దాదీరావు, దీపక్, సుమేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంఘాల రాస్తారోకో

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సమస్యలపై చర్చించడానికి అవకాశం కల్పించడం లేదని ఆరోపిస్తూ ఆదివాసీ సంఘాల నాయకులు మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. సీఆర్టీల నియామకానికి నోటిఫికేషన్ ప్రకటించలేదని ఆరోపించారు. బుధవారం జరిపిన సీఆర్టీల డెమో సరిగా లేదని తెలిపారు. ఈ విషయమై మాట్లాడేందుకు వెళ్లగా పీవో ఆంక్షలు విధించారని, అమర్యాదగా వ్యవహరించారని విమర్శించారు. దీంతో పీవో వైఖరిని నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించినట్లు తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్కాపురావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్, ఎస్సై ప్రవీణ్ వారిని సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు. గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు దేవేందర్, మెస్రం శేఖర్ మాట్లాడుతూ.. పీవో వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పీవో తీరు మార్చుకోకుంటే నిరంతరం ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. తుడుం దెబ్బ ఆదివాసీ విద్యార్థి సంఘం, ఏజెన్సీ డీఎస్సీ సాధన సమితి, ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినదించారు. నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. నాయకులు నగేశ్, పొచ్చన్న, ఆరిఫా, అనసూయ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో అక్రమ డిప్యుటేషన్లకు తెర

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కేజీబీవీ నియామకాల్లో అర్హతలున్న అభ్యర్థికి బదులు మరొకరికి పోస్టింగ్ ఇవ్వడంతో వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ వ్యవహారం సమసిపోక ముందే కొత్తగా కేజీబీవీల్లో అక్రమ డిప్యుటేషన్లకు అధికారులు తెరలేపారు. కేజీబీవీల్లో డిప్యుటేషన్లకు అవకాశం లేకున్నా నిబంధనలు తుంగలో తొక్కారు. భీంపూర్ కేజీబీవీలో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ సీఆర్టీకి మావల కేజీబీవీకి డిప్యుటేషన్ కల్పించారు. దీంతో భీంపూర్ కేజీబీవీ విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10 వరకు 213 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరి భవిష్యత్ గురించి అధికారులు ఆలోచించడం లేదు. మావల కేజీబీవీలో 8వ తరగతి చదువుతున్న 35మంది విద్యార్థినుల కోసం సీఆర్టీకి డిప్యుటేషన్ కల్పించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేజీబీవీలు ప్రారంభమైన నుంచి ఇప్పటివరకు డిప్యుటేషన్ ప్రక్రియ జరగలేదు. కొత్తగా డిప్యుటేషన్ ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చి పలువురు ఆయా కేజీబీవీల్లో పనిచేస్తున్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటున్న వారికి ఇవ్వని డిప్యుటేషన్లు 30 కిలోమీటర్ల దూరంలోని కేజీబీవీల్లో పని చేస్తున్న సీఆర్టీలకు కల్పించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, కొన్నేళ్లుగా భీంపూర్ కేజీబీవీ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలోనే కొనసాగింది. ఈ ఏడాది భీంపూర్‌లో పక్కా భవనం నిర్మించడంతో గత నెలలో పాఠశాలను అక్కడికి తరలించారు. ఇంతలోనే సదరు సీఆర్టీ డిప్యుటేషన్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కేజీబీవీ సెక్టోరియల్ అధికారి ఉదయ్‌శ్రీని వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఫిజికల్ సైన్స్ సీఆర్టీకి డిప్యుటేషన్ కల్పించినట్లు పేర్కొన్నారు. భీంపూర్ కేజీబీవీలో పీజీ సీఆర్టీలతో విద్యాబోధన చేయిస్తామని వివరించారు.

క్లుప్తంగా

108లో సుఖప్రసవం



శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారం గ్రామానికి చెందిన గర్భిణి రెడ్డి లవలోకకు పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త అర్జున్న 108కి సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది అంబులెన్సులో కోటపల్లి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికం కావడంతో పంగిడిసోమారం అటవీప్రాంతంలోనే సుఖప్రసవం చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇరువురిని కోటపల్లి పీహెచ్‌సీకి తరలించారు. కార్యక్రమంలో ఈఎంటీ షబనాజ్, పైలట్ ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాణిసతీజీ కాలనీలో ఉన్న ఐఎఫ్‌సీ ఫుడ్‌కోర్టులో ఈనెల 15న రాత్రి జరిగిన చోరీలో నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. దుకాణంలోంచి రూ.వెయ్యి నగదుతో పాటు ఓ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారని షాపు యజమాని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

సిమ్స్‌లో సింగరేణికి 7 సీట్లు

శ్రీరాంపూర్: రామగుండంలోని సిమ్స్ (సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో కంపెనీ కోటా కింద 7 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉద్యోగులు, అధికారుల పిల్లలకు ఈ సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

సింగరేణిలో ఆర్టీఐకి అడ్డంకులు

- సమాచార అధికారుల నియామకంలో జాప్యం
- నిలిచిన దరఖాస్తుల స్వీకరణ



శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్టీఐ దరఖాస్తులకు అడ్డంకి ఏర్పడింది. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో అధికారులు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్-2005) దరఖాస్తులు స్వీకరించడం లేదు. మూడు నెలలుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో సమాచారం కోరే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా పరిధిలో ఈ చట్టం కింద దరఖాస్తులు స్వీకరించాల్సిన పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐవో), అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఏపీఐవో) లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. పీఐవోగా బాధ్యతలు స్వీకరించిన ఓ డీజీఎం అధికారి ఏప్రిల్ 15న అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ఆతర్వాత ఏపీఐవోగా బాధ్యతలు నిర్వహించిన అధికారి కూడా గత నెల ఇక్కడి నుంచి ఇతర ఏరియాకు బదిలీ అయ్యాడు. ఆ స్థానాన్ని కూడా భర్తీ చేయలేదు. దీంతో ఈ రెండు సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. పీఐవో బాధ్యతలు నిర్వహించే అధికారి మృతి చెందిన తరువాత మరో పూర్తిస్థాయి అధికారిని నియమించే వరకు ఏపీఐవోకు ఇన్‌చార్జి పీఐవో బాధ్యతలు అప్పగించడానికి అనుమతి కోరుతూ ఏరియా అధికారులు కార్పొరేట్ అధికారులకు లేఖ రాశారు. వారు ఆలస్యంగా స్పందించడంతో అలోపే సదరు ఏపీఐవో అధికారి కూడా ఇక్కడి నుంచి వేరే ఏరియాకు బదిలీ అయ్యారు. దీంతో ఈ రెండు బాధ్యతలను చూసేవారు కరువయ్యారు.

వెనుదిరిగి పోతున్న దరఖాస్తుదారులు

సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవడానికి జీఎం కార్యాలయానికి వచ్చిన కార్మికులు, సమాచార చట్టం కార్యకర్తలు, పౌర సమాజ కార్యకర్తలు అక్కడ అధికారులెవ్వరూ దరఖాస్తులు స్వీకరించకపోవడంతో వెనుదిరిగి పోతున్నారు. ఆ స్థానాల్లో అధికారులు వచ్చేంత వరకు తమకు ఈ దరఖాస్తులు స్వీకరించే అధికారం లేదని ఇతర అధికారులు వారికి చెప్పి తిప్పి పంపిస్తున్నారు. దీనికి తోడు ఇది వరకే పీఐవోకు దరఖాస్తు చేసుకున్నాక సరైన సమాచారం, స్పందన లేకపోవడంతో అప్పిలేట్ అధికారిగా ఉన్న ఏరియా జీఎంకు దరఖాస్తులు చేసుకున్న వారూ ఉన్నారు. ఆ దరఖాస్తులపై కూడా నిర్ణయం తీసుకోవాలంటే కూడా పీఐవో వద్ద సమాచారం తీసుకోవాల్సి ఉంటుంది. పీఐవో లేకపోవడంతో అప్పిలేట్ దరఖాస్తులు కూడా పరిష్కారానికి నోచుకోకుండా మరుగునపడ్డాయి. కార్పొరేట్ అధికారుల జాప్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలిసింది. చట్టబద్ధత గల ఇలాంటి పోస్టుల భర్తీలో జాప్యం చేయడం సరికాదని, ఇలా చట్టాలను నీరుగార్చుతున్నారని దరఖాస్తు దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర సమాచార హక్కు చట్టం పరిరక్షణ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేట్‌కు లేఖ రాశాం..

పీఐవో, ఏపీఐవో పోస్టులు భర్తీ చేయడం కోసం కార్పొరేట్ అధికారులకు లేఖ రాశాం. కార్పొరేట్ అధికారుల ఆదేశాల మేరకే ఈ నియామకాలు జరుగుతాయి. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– ఎం.శ్రీనివాస్, జీఎం, శ్రీరాంపూర్

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ షురూ



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ శివారులోని కొండాపూర్ వద్ద ఉన్న నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో గురువారం రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల నుంచి 180మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. గురువారం క్వాలిఫై పోటీలు నిర్వహించగా.. శుక్రవారం నుంచి ఈ నెల 20వరకు ప్రధాన పోటీలు కొనసాగుతాయి. అండర్-19 బాలురు, బాలికలు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్, వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్‌గౌడ్, మహేష్, ప్రణీత్, నందకుమార్ పోటీలను పర్యవేక్షించనున్నారు. శుక్రవారం మెయిన్ డ్రా పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ఆశ్రమ ప్రాథమిక పాఠశాలల్లో సీఆర్‌టీ(ఎస్‌జీటీ)ల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 18 నుంచి 23లోగా గిరిజన సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. స్థానిక గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, డీఈడీ పాసై, టెట్ అర్హత సాధించి ఉండాలన్నారు. ఈ నెల 25న అర్హత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు బలవన్మరణం

ఖానాపూర్: మద్యానికి బానిసై ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వీవీరావుపేటకు చెందిన మండ్ల శ్రీనివాస్ గల్ఫ్ నుంచి వచ్చి కొన్నేళ్లుగా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రజిత, కుమార్తెలు శ్రీనిధి, శ్రీహిత ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన ఆరుగురి అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఒకరి ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన గుండ సునీత, భూమయ్య ఉపాధి నిమిత్తం హాజీపూర్‌లో నివాసం ఉంటున్నారు. ముల్కల్లలోని సమీప బంధువులు సునీత తమను ఆర్థికంగా మోసం చేసిందని మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారు. భూమయ్య ఫిర్యాదు సుద్దాల రాజేశ్వరి, సుద్దాల సుమన్, దామెర జయకుమార్, దామెర సురేందర్, సుద్దాల మౌనిక, దండు వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

బెజ్జూర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సర్తాజ్‌పాషా తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన లెండుగూరి భీంరావు (55)భార్య విమల ఆరేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం మత్తులో తన పత్తి చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు అశ్విక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బోథ్ కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ వితల్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన తబస్సు ఖానమ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్ష తీసుకున్నారని పేర్కొన్నారు. అనంత సొల్యూషన్ ఔట్‌సోర్సింగ్ ద్వారా గతేడాది ప్రభుత్వ పాఠశాల బాలక్ మందిర్‌లో కాంట్రాక్ట్ టీచర్‌గా ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. ఏడు నెలల పాటు ఉద్యోగం చేయగా, కేవలం ఒక నెలకు సంబంధించి రూ.16వేల వేతనం చెల్లించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆరు నెలల వేతనం ఇవ్వకపోవడంతో విధులు మానేసినట్లు తెలిపారు. ఈ విషయమై తనను మోసం చేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

డయల్ 100 సేవలు దుర్వినియోగపర్చిన ఒకరిపై..

నిర్మల్: అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన డయల్ 100 సేవలను మద్యం మత్తులో దుర్వినియోగపరిచిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. సర్సాపూర్ (జి) మండల కేంద్రంలో బుధవారం రాత్రి కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ, మోహన్ పెట్రో కార్ విధులు నిర్వహిస్తుండగా మండల కేంద్రానికి చెందిన తక్కల మహేష్ మద్యం మత్తులో డయల్ 100కు పలుమార్లు ఫోన్ చేసి న్యూసెన్స్ చేశాడు. దీంతో మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కడెం: మండలంలోని కొండుకూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని నవబ్‌పేట్‌కు చెందిన జక్కుల శ్రీనివాస్ బైక్‌పై కడెం నుంచి నవాబ్‌పేట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో కొండుకూర్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సారంగపల్లిలో చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లిలో ఆసంపల్లి స్వామి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు స్వామి పది రోజులక్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లాడు. బుధవారం ఇంటికి వచ్చిచూడగా తాళం తీసి ఉంది. వెంటనే లోనికి వెళ్లి బీరువాను తెరిచి చూడగా అందులో దాచి ఉంచిన రూ.22 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన బాధితుడు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్ట్



బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

జైనథ్ : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బేల మండలానికి చెందిన సుమిత్, అతని మిత్రుడైన సలీం షకీల్‌తో కలసి మహారాష్ట్రకు చెందిన కృష్ణతో గ్యాంగ్‌గా ఏర్పడ్డారన్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్, బేల, మహారాష్ట్ర కోర్పణ మండలాల్లో బైక్‌లను అపహరించి ఇతరులకు విక్రయిస్తుండేవారన్నారు. వారి వద్దనుంచి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. కోటపల్లి మండలంలోని రాంపూర్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. డ్రైవర్ సంజయ్‌ను అదుపులోకి తీసుకుని సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించమన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రెండోలీగ్‌లో ఓడిన ఉమ్మడి జిల్లా జట్టు



సాయికుమార్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎ స్సార్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రెండో లీగ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు సాయి సత్య టీంతో 90 ఓవర్ల చాంపియన్‌షిప్‌లో ఓడిపోయింది. ఆదిలాబాద్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 30.3 ఓవర్లలో 93 పరుగులకు ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్ చేసిన సాయిసత్య టీం 24.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసి విజయం సాధించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులోని సాయికుమార్ 7 వికెట్లు సాధించడం గమనార్హం. పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలంగా ఉండడంతో, ఇరు జట్లు పరుగులను చేసేందుకు ఇబ్బంది పడ్డాయని కోచ్ ప్రదీప్ తెలిపారు.

దివ్యాంగులకు రైలులో రాయితీపై ప్రయాణం



మాట్లాడుతున్న ఐఎస్‌ఆర్ మూర్తి

మంచిర్యాలఅర్బన్: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి రైల్వేశాఖ రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందని సికింద్రాబాద్ డివిజన్ (ఎస్‌సీఆర్) అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐఎస్‌ఆర్ మూర్తి అన్నారు. గురువారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పించారు. మంచిర్యాల కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: షట్టర్ లిఫ్టింగ్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన రాజుసింగ్ మోహన్‌సింగ్, సేవక్‌సింగ్ రఘుబీర్‌సింగ్, సుర్దిప్ సింగ్ ముగ్గురు బంధువులు. నిర్మల్ జిల్లాలో కూలి పనులు చేసేవారు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న రాత్రి బైక్‌పై లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ చేరుకుని పెట్రోల్ బంక్ సమీపంలోని ఇంటి ముందున్న బైక్‌ను దొంగలించారు. అనంతరం ఓ గోల్డ్‌షాప్‌లో చొరబడి బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. అదే రాత్రి ఉమ్రికి వెళ్తూ మార్గమధ్యలో కుంటాల మండలం కల్లూరు బస్టాండు సమీపంలో రెండు దుకాణాల తాళాలు పగులగొట్టి రూ.2,500ల నగదు అపహరించారు. గురువారం నిర్మల్‌లో బంగారం విక్రయించడానికి వచ్చారన్న పక్కా సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.7 కిలోల వెండి, 17 గ్రాముల బంగారం, రూ.2,500 నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెండి ఆభరణాలను 'నిర్మల్ పోలీస్' అని అందంగా అలంకరించి, తప్పించుకోలేరని ఒక మెసేజ్ ఇచ్చారు. కేసును ఛేదించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, అశోక్, పీసీఆర్ ఎస్సై ప్రదీప్ కుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఇచ్చోడలో దొంగల బీభత్సం

- ఒకేరోజు మూడిళ్లలో చోరీ
- బంగారం, వెండి, నగదు అపహరణ



ఇంటి తాళం పగులకొట్టిన దృశ్యం

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన జాదవ్ దేవిదాస్ మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి సొనాల మండలంలోని ఘన్‌పూర్‌కు వెళ్లారు. తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లో చొరబడి తులం బంగారం, 20 తులాల వెండి, రూ.10 వేల నగదు దొంగిలించారు. విద్యానగర్ కాలనీలోని రమేశ్ ఇంట్లో చొరబడి 4 గ్రాముల బంగారంతో పాటు నగదు అపహరించారు. అదేకాలనీలో ఉన్న చిక్రం జంగు ఇంట్లో తులం బంగారం, ఐదు తులాల వెండి దొంగిలించారు. సంతోషిమాత ఆలయం వద్ద పార్క్ చేసిన పల్సర్ 220 బైక్‌ను తీసుకెళ్లి ఆదిలాబాద్ బైపాస్ వద్ద వదిలేసి పరారయ్యారు. అప్రమత్తమైన పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలను రప్పించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

'ఉమ్మడి జిల్లా బంద్‌కు సహకరించాలి'



మాట్లాడుతున్న వెట్టి మనోజ్

ఆదిలాబాద్: జీవో 49 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 21న చేపట్టనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు సహకరించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు, ప్రజాస్వామ్యవాదులు, గ్రామ పటేళ్లు, రాయి సెంటర్ సార్‌మేడీలు, ఆదివాసీ కుల సంఘాలు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, ప్రజా సంఘాలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు వెడ్మ బొజ్జు, ముకుందరావు, పీ.నాగోరావు, గెడం ఆనందరావు, దుర్వ జుగాదిరావు, ఆత్రం మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: కెరమెరి మండలంలోని నిషాని గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి ఆత్రం వంశీకృష్ణ పైచదువుల నిమిత్తం గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్‌లో అపజయాలు ఉండవని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

సన్మానం

కళామందిర్ ఫౌండేషన్ ద్వారా ఇటీవల సేవారత్న పురస్కారం అందుకున్న కాత్లే మారుతిని గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సన్మానించారు. ఆదిలాబాద్ మండలం చించుఘాట్ గ్రామానికి చెందిన మారుతి ఎంతోమంది గిరిజన విద్యార్థులకు విలువిద్యలో శిక్షణ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఫౌండేషన్ తరపున అతనికి రూ.లక్ష నగదు, జ్ఞాపిక అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏసీఎంవో జగన్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడు మృతి



అశ్విత్ (ఫైల్)

దిలావర్‌పూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కొప్పుల అశ్విత్ (15) బుధవారం సాయంత్రం ఆడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం మండల కేంద్రంలోని కుడి చెరువులో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలకృత్యాల కోసం వెళ్లి చెరువులో జారిపడి మృతి చెందినట్లు అశ్విత్ తల్లి కొప్పుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. మండలంలోని వానల్‌పాడ్‌కు చెందిన సిద్దివార్ రమణ (45) పట్టణంలోని కోర్వగల్లిలో నివాసముంటున్నాడు. కుమారుడు రాజుతో కలిసి ఉదయం స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో కిడ్నాప్ కలకలం

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో బాలుడి కిడ్నాప్‌కు యత్నం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన ఐదేళ్ల బాలుడికి తండ్రి కిరాణా కొట్టువద్ద బిస్కెట్ ప్యాకెట్ కొనిచ్చి ఇంటికి వెళ్లమని చెప్పాడు. అదే గ్రామానికి వెంట్రుకలు కొనుగోలు చేయడానికి ఆటోలో వచ్చిన ఆరుగురు మహిళలు బాలున్ని ఆటోలో ఎక్కించుకుని వెళ్లారు. బాలుడు ఇంటికి రాకపోయేసరికి కంగారుపడిన తల్లిదండ్రులు అనుమానంతో బంగల్ పేట్ మహాలక్ష్మి వద్ద ఉన్న తెలిసిన వారికి ఫోన్ చేసి విషయం తెలిపారు. అప్పటికే ఆ మహిళలు మహాలక్ష్మి కాలనీకి కొద్ది దూరంలో బాలుడిని దించి వెళ్తుండగా పట్టుకుని నిలదీశారు. తమకేం తెలియదని బుకాయించడంతో వారిపై దాడి చేశారు. అనంతరం మహిళలను పోలీసులకు అప్పగించారు.


పిచ్చికుక్క స్వైరవిహారం



ఆస్పత్రి ఎదుట క్షతగాత్రులు

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లిలో గురువారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. అల్లాడి అనసూర్య ఎడమచేయి మణికట్టు వద్ద, ఆలం సాంబయ్య కాళ్లకు, చెన్నూరి బక్కు తల వద్ద, శనిగారపు పోశం కాళ్లకు, తలండి శ్రీనివాస్ చేతులను కొరికింది. చెన్నూరి శేఖర్‌పై పడి కొరికేందుకు ప్రయత్నించగా కర్రతో కొట్టి చంపాడు. జిల్లెడలో కూడా మరో నలుగురిపై దాడి చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. క్షతగాత్రులను ఆటో సాయంతో వేమనపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

కుక్క దాడిలో ఇరువురికి గాయాలు



గాయపడిన మహిళ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కాపువాడకు చెందిన కర్ల కళావతిపై కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరి మేయడంతో ప్రాణాపాయం తప్పింది. రైల్వే స్టేషన్‌కు వెళ్లే మరో ప్రయాణికునిపై కూడా కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే స్టేషన్‌లో కుక్కల బెడద ఉందని 'సాక్షి' బుధవారమే కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారులు స్పందించక పోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే స్టేషన్ పరిసరాల్లో కుక్కల బెడదను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.